కథ

# గుణపాఠం

## శివల పద్మ

"మధ్య మధ్యలో పూజలూ వ్రతాలు చేయించడం అనేది ఇంటికి చాలా మంచిది. చాలారోజుల తర్వాత వ్రతం చేయిస్తున్నారు. మీరిద్దరూ పీటల మీద కూర్చుంటున్నారు. ఏదైనా కొత్తచీర కొనుక్కో" అంటూ ఐదు వందలు కోడలి చేతిలో పెట్టింది కామేశ్వరి.

సంపాదిస్తున్న కోడలిని కూడా పసిపిల్లలా చూస్తూ డబ్బులు చేతిలో పెడుతుంటే ఆవిడ ఆప్యాయతకి చలించిపోయింది సుప్రీతి.

"మీరిలా డబ్బులిచ్చి చీర కొనుక్కోమంటే ఎందుకు కొనుక్కోనూ..చేదా? కాకపోతే ఐదు వందలు సరిపోవత్తయ్యా!"

"ఏదైనా మామూలు చీర కొనుక్కోవే..వస్తుందిగా"

"నా ఒక్కదానికైతే తప్పనిసరిగా వస్తుంది. కానీ మీ అబ్బాయికి ఇప్పుడో రెండో సెటప్ ఉంది. అన్నిటా నాతో సమానంగా తనకి చేయాలి. మరి తనకి కూడా చీర కొనాలంటే మరో ఐదు వందలు కావాలిగా?" తాపీగా చాలా మామూలుగా చెప్పింది.

ముసలావిడ తెల్లబోయింది.

"నీ ముఖం..ఏమిటా పిచ్చిమాటలు? చాల్లే ఊరుకో" అంది తేరుకుంటూ.

"పిచ్చిమాటలు మాట్లాడడానికి నేనేమైనా పిచ్చిదాన్నా అత్తయ్యా! అయినా మీతో చెప్తున్నానంటే వాస్తవం అనేగా? పోనీ మీకింత అపనమ్మకం అయితే మీ అబ్బాయినే అడగండి. ఎదురుగానే ఉన్నారుగా"

అప్పటికే చంద్రకాంత్ ముఖం జేవురించి ఉంది! నిప్పులు కురిసేలా భార్యని చూసాడు.

"ఏమిట్రా చందూ! దీనికేమైనా పిచ్చి పట్టిందా? ఏం మాట్లాడుతోంది?" అయోమయంగా కొడుకుని చూసిందావిడ.

"పొగరెక్కువైందమ్మా నీ కోడలికి..అంతకన్నా ఇంకేం లేదు"

"నేనన్న మాట ముమ్మాటికీ అబద్ధం అని చెప్పమనండి. తప్పకుండా నాకు పొగరని నేను ఒప్పుకుంటాను" అంతే శాంతంగా అంది సుప్రీతి.

చంద్రకాంత్ లేచి చరచరా వెళ్ళిపోయాడు అక్కడినుంచి.

పెద్దావిడ ముఖం పాలిపోయింది.

షెల్ఫ్‌లో పుస్తకాలు సర్దుతున్న సుప్రీతి దగ్గరకు వచ్చింది ఆమె.

తలతిప్పి అత్తగారి వైపు చూసి పేలవంగా నవ్వింది సుప్రీతి.

"ఏమవుతోందే మీ సంసారం? ఈ కొత్త జంజాటాలేమిటి? ఎవరా పిల్ల?"

"పిల్ల కాదు పిల్లలకు తల్లి. తనతో పాటు అదే సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తుంది. ఇద్దరిదీ నైట్ డ్యూటీయే అవడం వలన పరిచయం పెరిగి ప్రేమగా మారింది"

దుమ్ము పడిన బుక్ తీసి దులిపి మళ్ళీ రాక్‌లో పెట్టింది.

"అసలెలా అయిందే ఇదంతా? ముచ్చటగా ఉన్న సంసారంలోకి మూడో మనిషి రావడం ఏమిటి?"

నిట్టూర్చి అక్కడే నేల మీద కూర్చుని తల గోడకి ఆనందించింది.

ooo

"ఏమిటి వందసార్లు రెట్టిస్తావు? నీకేం కావాలి?"

"ఇచ్చింది చాలు. ఈ పరిచయానికి గమ్యం ఏమిటి అని అడుగుతున్నాను. మీ నిర్ణయం ఏమిటో తెలుసుకోవాలని అనుకుంటున్నాను"

"నువ్వు కుళ్ళిపోయి కుమిలిపోయేందుకు ఏమీ లేదిక్కడ. మేము జస్ట్ ఫ్రెండ్స్"

"ఆ ఫ్రెండ్‌షిప్‌లో పవిత్రత ఏమిటో నాకు తెలిసాకే అడుగుతున్నాను. పోనీ నేనేం చేస్తే బాగుంటుంది?"

"ఏం చేస్తావు? అందరు ఆడవాళ్ళలాగే సంసారం చేస్తావు? ఇందులో పెద్ద రాద్ధాంతం చేసేందుకేముంది?"

రక్తం సలసల మరిగింది సుప్రీతిలో.

ఎంత ధీమా...ఎంత నిర్భయం!

ఏం చేస్తావు? అందరు ఆడవాళ్ళలాగే సంసారం చేస్తావు. అందరు ఆడవాళ్ళలాగే..అందరు ఆడవాళ్ళలాగే..

కళ్ళ నిప్పు కణికల్లా మారాయి.

"అంటే మీ మానాన మీరు ఎవరితో సంబంధాలు పెట్టుకున్నా నేను ఏమీ చేయలేనా. మారు మాట్లాడకుండా సంసారం చేస్తాను. అంతేగా.." వెల్లువవుతున్న ఆవేశాన్ని కంట్రోల్ చేసుకుంటూ అడిగింది.

"ఎవరైనా అదే చేస్తారు. మగాడన్నాక ఆకర్షణలుంటాయి. పరిచయాలూ ఉండవచ్చు. భార్యకే పరిమితమైపోయిన మగాడు నీకు ప్రపంచంలో ఎక్కడా దొరకడు..ఈ మాత్రం దానికే రాద్ధాంతం దేనికి?"

నివ్వెరబోయింది సుప్రీతి ఆ నిర్భయానికి.

ఎంత అహంకారం!

నేనేం చేసినా నువ్వు చచ్చినట్లు నా కాళ్ళ దగ్గర పడుంటావు అని ఎంత ధీమా!

తప్పేం లేదు. సమాజమూ స్వయానా ఆడదీ కలిసి ఇచ్చిన ధైర్యం అది. ఈరోజు ఎక్కడికి పోతుంది.

"మరి నేను మరో మగాడితో సంబంధం పెట్టుకున్నా మీరు చచ్చినట్లు నాతో సంసారం చేస్తారా?" సూటిగా అడిగింది.


"బరితెగించిన ఆడదాన్ని భరించాల్సిన అవసరం లేదు"

"మరి మాట తప్పిన మగాడిని ఎందుకు భరించాలి?"

"భరించకేం చేస్తారు? సంసారాలు వదిలేస్తారా? బయటకు వెళితే మీకు దిక్కెవరు? సంపాదన ఉన్నంత మాత్రాన గౌరవం ఉంటుందా? ప్రతివాడు రాత్రిపూట తలుపు తడతాడు. అదీ మీకు దొరికే గౌరవం"

దీర్ఘంగా నిశ్వాసం కొద్ది క్షణాలు మౌనంగా ఉంది సుప్రీతి.

"చందూ! చాలా చూసాను నీ అహంకారాన్ని. ఇంతసేపు నేను నిన్ను మాట్లాడించింది నువ్వేమిటో తెలియడానికి. అంతే తప్ప నేనేం చేయాలో తెలుసుకోవడానికి కాదు. నీకు నేను రెండే ఆప్షన్స్ ఇస్తున్నాను. ఒకటి పిచ్చి పిచ్చి సంబంధాలు వదుల్చుకుని నాతో సంసారం చేయడం. రెండు - నీ ఉంచుకున్నదే నీకు ముఖ్యమైతే వెంటనే ఇంట్లోంచి వెళ్ళిపో. ఈ ఇంట్లో ఉండడానికి వీలు లేదు. కన్నీళ్ళు వత్తుకుంటూ పరమ పతివ్రతలా నీకు సేవలు చేస్తానని అనుకోవద్దు. పళ్ళు రాలగొడతాను పిచ్చి వేషాలేస్తే..ఇద్దరు ఆడవాళ్ళని మేనేజ్ చేయడం నీకు ముచ్చటగానే ఉండవచ్చు. ప్రతి అడ్డమైన దాంతోనూ నిన్ను పంచుకునేటంత సహనం నాకు లేదు. అవసరం అంతకన్నా లేదు. సో వెంటనే నువ్వు ఇంట్లో నుంచి వెళ్ళిపో. ఆడది తప్పు చేస్తే మీరిదేగా అంటారు. అందుకనే అదే న్యాయం మీక్కూడా.



మరో విషయం - మనం కలిసి ఉండము. నేను నీకు విడాకులు ఇవ్వను. ఇంటి ఖర్చులు పిల్లల ఖర్చులు, కారు డ్రైవర్ శాలరీ ఈ మొత్తానికి అయ్యే అమౌంట్ ప్రతి నెల ఫస్ట్‌కి బాంక్‌లో డిపాజిట్ కావాలి. దానికి తగిన ఏర్పాటు చేయి. ఈ పద్ధతి ఎందుకంటే ప్రతి అడ్డ గాడిద ఓ పిల్లనో పిల్లాడినో కనేసి వాళ్ళని పెళ్ళాం నెత్తిన వదిలేసి వాడి సరదాలు వాడు వెతుక్కోవడం ఇప్పుడొక అలవాటుగా మారింది. ఈ ఇల్లాలు తన దురదృష్టాన్ని నిందించుకుంటూ శేష జీవితాన్ని వారిని పెంచడంలో గడిపేస్తుంది. కూలీ నాలీ చేసైనా సరే వారిని పోషిస్తుంది. ఇప్పటివరకూ ఇదే అవుతుంది. నేనంత చేతగాని దాన్ని కాను. అందుకే ముందుగా హెచ్చరిస్తున్నాను."

"ఏమిటీ బెదిరిస్తున్నావు? తెగ రెచ్చిపోతున్నావు. ఈ ఫళాన నిన్ను మెడపట్టి రోడ్ మీదకి గెంటేస్తే ఏం చేయ గలవు? ఆ...ఏం చేయగలవే?" కళ్ళెర్ర జేసి ఉరిమాడు చంద్రకాంత్.

"నువ్వలా చేయలేవురా. ఎందుకంటే అలా చేసిన ఇరవై నాలుగ్గంటల్లోగా నువ్వు కటకటాల వెనుక ఉంటావు. చట్టం కూడా ఈ మాత్రం ఆడదానికి సహక రించకపోయి ఉంటే ఈపాటికి నీలాంటి మొగుళ్ళు దొరికిన సగం మంది ఇల్లాళ్ళు రోడ్ల మీదే ఉండేవారు. కానీ మీకా అవకాశం లేదు చంద్రకాంత్. మనం చదువు సంస్కారం ఉన్న వాళ్ళం. వాళ్ళలాగే మాట్లాడు కుందాం. నేను నా జీవితంలో ఏ క్షణమూ రాజీపడి బ్రతకను. అంతకన్నా నీకున్న సంబంధాల్లో నేనొక దాన్ని అవడం సహించను. మన మధ్య సంబంధం బాగున్నంత కాలమే నేను తాళికి విలువిస్తాను. అది లేని నాడు నా దృష్టిలో దానికెలాంటి విలువా లేదు. పూర్తి కమిట్‌మెంట్‌తో నేనెలా ఉన్నానో నువ్వూ అలాగే ఉండాలి. ఇది ఏమాత్రం తప్పినా నీతో జీవితం నాకు అవసరం లేదు. తప్పు నువ్వు చేసావు కనుక నువ్వే ఇంట్లోంచి వెళ్ళాలి. నిర్ణయం నువ్వు తీసుకునే అవకాశం లేదు"

"ఏం చూసుకుని నీకీ అహంకారం? మొగుడిని ఇంట్లో నుంచి వెళ్ళగొడతావా?"

"మొగుడు మొగుడిలా కాక కేవలం మగాడిలా ప్రవర్తిస్తే తప్పదు"

"నేను వెళ్ళను. దాన్ని వదలను. ఏం చేస్తావో చేసుకో" నిర్లక్ష్యంగా అన్నాడు.

తదేకంగా కొద్ది క్షణాలు అతడి వైపు చూసింది.

"చేసి చూపిస్తాను" పదునుగా అంది.

ooo

నిర్ఘాంతపోయింది సుప్రీతి అత్తగారు.

"ఏమిటే ఇదంతా ప్రీతీ! నువ్వెంతో జ్ఞానం ఉన్న బుద్ధిమంతురాలివి కదే..ఈ సవాళ్ళేమిటి? పాడయ్యేది ఎవరి సంసారమే తల్లీ!"

"అంటే ఇది కేవలం నా సంసార మేనా?"

"సంసారం అనేది ఆడదాని కేనే..మగవాడికి కాదు..దీన్ని మనమే కాపాడుకోవాలి. ఒడి దుడుకులు వస్తాయి. ఓర్పుగా, సహనంగా మనమే చక్కదిద్దుకోవాలి. సవాళ్ళు ప్రతి సవాళ్ళతో ఏం సాధి స్తారు? నా బంగారు తల్లి విగా..కొంచెం మంచిగా దారికి తెచ్చుకో అమ్మా! ప్రేమతో గెలు చుకో..అంతే గానీ పంతాలతో పరిష్కారం





...దా నిలయం

దొరకదే తల్లీ!" ప్రాధేయతగా అంది.

"అంటే నన్నిప్పుడేం చేయమని మీ ఉద్దేశ్యం?" శాంతంగా అడిగింది సుప్రీతి.

"కోపం తగ్గించుకో. కొంచెం మెత్తపడు. ప్రేమగా దగ్గర కూర్చుని లాలించి తను చేస్తున్నది తప్పని చెప్పు. తప్పకుండా మారతాడు"

షాక్, ఆవేశం, కోపం, అవమానం, బాధ, విరక్తి...ఇవేవీ కాని వీటికి అతీతమైన ఒక ఫీలింగ్ కలిగింది ఆ మాట వినగానే సుప్రీతికి.

అసలు ఆ మాటకి ఎలా రియాక్ట్ అవ్వాలో అర్థం కానంత స్తబ్దుగా అయిపోయింది మెదడు.

"కూల్ ప్రీతీ! కూల్..ఇది తరతరాలుగా యుగయుగాలుగా వారికి తెలిసిన పరిష్కారం...ముందు నువ్వు మాట్లాడుతున్న వ్యక్తిని, వ్యక్తిత్వాన్ని గుర్తించు. వారి దృష్టిలో అదే సరి అయినది. అలా అని వందల ఏళ్ళ నుంచి వారిని నూరిపోస్తున్నారు. కనుక మరో రకమైన స్పందన ఆశించకు. రియాక్టవ్వకు. విను...అంతే" అంతరాత్మ చెప్పింది.

ఇందాక చెప్పినట్లు విరక్తికన్నా అతీతమైన భావనతో అత్తగారివైపు చూసింది సుప్రీతి.

"తను నా అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని, స్త్రీత్వాన్ని అన్నిటినీ అవమానపరచి మరో ఆడదానితో సంబంధం పెట్టుకుంటే నేను ఆ అవమానాన్ని దిగమింగి ప్రేమగా లాలించాలా? ఎందుకత్తయ్యా! నేనంత దిగజారాలి" నిర్వేదంగా అడిగింది.

"మగవాళ్ళంటే అంతేనే..మీకు అనుభవం లేదు కనుక చిందులు తొక్కుతారు కానీ భోగం వాళ్ళతో గడిపి ఇంటికి వస్తే మా అత్తగారు స్నానానికి నీళ్ళు కాచి ఉంచేది. మళ్ళీ రాత్రవగానే ఆయన వెంట పడగ్గదిలోకి వెళ్ళాల్సిందే. ఇలా చిందులు తొక్కితే ఏం సంసారాలు చేసే వాళ్ళు?"

వందలకొలదీ తేళ్ళు జెర్రులనో తెచ్చి ఒంటిమీద వదిలినట్లయింది ఆమెకి.

ఆమెని ఒక్క ప్రశ్న వేసినా తను పిచ్చెక్కిపోవడం ఖాయం. అందుకే మౌనం వహించింది సుప్రీతి.

"నా మాట విను ప్రీతీ! దీన్ని గొడవ చేయకు. కొద్దిరోజులు సహనం వహించు. వాడే దారిలోకి వచ్చేస్తాడు. సంసారాన్ని పాడు చేసుకోకు"

సుప్రీతి ముందుకు వంగి అత్తగారి రెండు పాదాలనూ చేతులతో పట్టుకుంది.

"నన్ను క్షమించండి అత్తయ్యా! ఈ ఒక్కసారి మీ తరం పరిష్కారాన్ని వదిలి నా తరం పరిష్కారాన్ని ఇవ్వనివ్వండి. ఈ సంసారం నా ఒక్కదానిదే కాదు. కనుక కాపాడుకోవలసిన బాధ్యత ఇద్దరికీ ఉంది. నా పద్ధతిలో ఒక్కసారి నన్ను బుద్ధి చెప్పనివ్వండి"

"పరువు పోతుందే"

"పరువు పోయే పని మొగుడు చేస్తే దాన్ని పెళ్ళాం కాపాడాలా? నేనెందుకు కాపాడాలి? చెప్పండి. ఏం పొందుతానని నేను పరువు కాపాడాలి? తను నన్ను అవమానించి మరో ఆడదానితో వెళితే బయట పడితే పరువు పోతుందని కన్నీళ్ళతో అవమానాన్ని దిగమింగి తన పరువు నేను కాపాడాలా? ఇలా మీరంతా కాపాడబట్టే కదా వాళ్ళంతా నిర్లజ్జగా, నిర్భయంగా అందరితో తిరిగి ఇంటికి వచ్చేవారు?

అలా కాపాడినందుకు మీకేం వచ్చింది? ఏనాడైనా ప్రేమ, గౌరవం పొందారా? పనిమనిషిలాగే కదా బ్రతికింది? ఆ బ్రతుకు కోసమేనా ఈ అవమానాలను దిగమ్రింగడం? అదే దారిలో నన్ను కూడా ఎందుకత్తయ్యా నడవమంటారు? నేను తనకేం తక్కువ చేసానని ఇలాంటి పని చేసాడు?"

"వాడు చేసింది తప్పే..అందుకే క్షమించమంటున్నాను"

"ఆయన అలా అనడం లేదు. ఏం చేసుకుంటావో చేసుకో అంటున్నారు. అదే నేను చేసి చూపాలనుకుంటున్నాను. దయచేసి నన్ను మన్నించండి. మీరేమీ నాకు చెప్పొద్దు"

ooo

"రండి మామయ్యగారూ! ఎలా ఉన్నారు? చిన్నత్తయ్యగారూ! మీ ఆరోగ్యం ఎలా ఉంది? ఆయుర్వేదం మందు కంటిన్యూ చేస్తున్నారా?"

"చేస్తున్నానమ్మా! అందుకే కాస్తంత నడవగలుగుతున్నాను. లేకపోతే మోకాళ్ళ నొప్పులు నన్ను లేవనిచ్చేవా? ఏమిటీ ఉన్నట్టుండి సత్యనారాయణ వ్రతం అన్నారు. ఊరికేనేనా లేక ఏమైనా విశేషమా?"

"విశేషమంటే విశేషమే..మా ఆయన ఉంచుకున్న అమ్మాయిని మన కుటుంబంలో వారందరికీ పరిచయం చేద్దామని..ఇంకాసేపట్లో వస్తుంది. చూద్దురు గాని" చంద్రకాంత్ ముఖం నల్లగా మాడిపోయింది.

చంద్రకాంత్ బాబాయి, పిన్నీ అయోమయంగా ఒకరి ముఖం ఒకరు చూస్కున్నారు. చంద్రకాంత్ తల్లి

## డేరింగ్ గాళ్!

*'నగరం' సినిమాలో తన అందచందాల్ని ఎంచక్కా ఆరేసి టాలీవుడ్ నిర్మాతల్ని ఆకట్టుకున్న కావేరీ ఝా ఇప్పుడిప్పుడే బిజీ అవుతోంది. ఈ సమయంలో తన పర్సనాలిటీ విషయంలో తెగ జాగ్రత్తలు తీసుకుంటున్నానంటోంది. ముఖ్యంగా అడపాదడపా కాస్తో కూస్తో పుచ్చుకునే 'మందు'ని పూర్తిగా మానేస్తున్నానంటోందట కావేరీ. ఈ అలవాటు మానేయడం వల్ల తన అందం మరింత మెరుగుపడుతుందని భావిస్తున్న కావేరీ ఝా, ఎంతయినా డేరింగ్ గాళే కదా!*



నుదురు కొట్టుకుంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

"అలా తెల్లబోతారేం మామయ్యగారూ! మీ అబ్బాయికి నేను సరిపోక మరో కొత్తమ్మాయిని మెయిన్‌టెయిన్ చేస్తున్నాడు. తను కూడా ఈయన దృష్టిలో నాతో సమానమే కనుక మరి మీరంతా తనని చూడాలి కదూ! అందుకనే ఈ చిన్న గెట్ టు గెదర్ అన్నమాట"

చంద్రకాంత్ పళ్ళు కొరుకుతూ మింగేసేలా సుప్రీతిని చూసాడు. ఇది అతడు ఊహించని పెద్ద దెబ్బ!

సాధారణంగా పడగ్గదిలో ఏడిచి రాద్ధాంతం చేసి బయటికి వచ్చేముందు కళ్ళూ ముఖం కడుక్కుని మామూలుగా ఉంటుందని ధీమాగా ఉన్న అతడు ఒక్కసారి ఈ పరిణామానికి తల్లక్రిందులయ్యాడు.

ఉక్రోషం, అవమానం అతడిని చుట్టుముట్టాయి. సుప్రీతిని గదిలోనికి తీసుకెళ్ళి బెల్టుతో చావ కొట్టాలన్నంత కోపం వచ్చింది.

పెద్దవాళ్ళందరూ ఏమనుకున్నారో గానీ ఏం

మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయారు.

"ఏమిటక్కా? ఆ గులాబీరంగు చీరా? అది మా ఆయన గర్ల్‌ఫ్రెండ్ కోసం కొన్నది. ఈ రంగు తనకి నప్పుతుందిలే"

"వదినా! కొబ్బరికాయ తురవమని ఇచ్చాను. అయిపోయిందా? నా సవతికి సాంబార్లో కొబ్బరి కాయ కోరి వేస్తే చాలా ఇష్టమట..ఆ పని కానివ్వు"

"మామయ్యగారూ! హాల్లో ఉన్న సీలింగ్ ఫాన్ మాటిమాటికీ ఆగుతోంది. ఒక్కసారి ఎలక్ట్రీషియన్‌ని పిలిచి రిపేర్ చేయించండి. తన ప్రియురాలిని ఉక్కలో కూర్చోబెడితే మీ అబ్బాయికి కోపం వస్తుంది"

చంద్రకాంత్ తల పట్టుకొని సోఫాలో కూలబ డ్డాడు.

సుప్రీతి అత్తగారు లోపల్నుంచి వచ్చి కోడలి చేతులు పట్టుకుంది.

"అయిందేదో అయింది. ఇంక ఆపేయమ్మా! ఒక్క సారి ఆ ఆడదాని గురించి ఆలోచించు. ఆ పిల్ల జీవితం.."

చేతులు విసరుగా వదిలించుకుంది.

"అంటే నాకు ద్రోహం చేసిన మొగుడితోపాటు వాడు ఉంచుకున్న దాని గురించి కూడా నేనే ఆలో చించి క్షమించాలా? కొంపదీసి ఇదేనా పాతివ్రత్యం అంటే? అయితే మీకో నమస్కారం..నేను పతివ్రతను కాను. చీమూ నెత్తురూ ఉన్న మామూలు ఆడదాన్ని. నన్నిలాగే ఉండని వ్వండి"

అదే సమయంలో గేటు ముందు భర్త తోపాటు కారు దిగిన నీలిమను చూడగానే హతాశుడయ్యాడు చంద్రకాంత్. ఒక్కసారి శరీరంలో సర్వశక్తులూ క్షీణించినవాడిలా నిస్రాణగా కళ్ళప్పగించి చూస్తూ ఉండిపో యాడు.

చిరునవ్వుతో ఆమెను ఆహ్వానించింది సుప్రీతి.

"రండి నీలిమగారూ! మీ గురించే వెయిటింగ్..ఏమండీ! ఎవరొచ్చారో చూసారా?"

"హాయ్! సుప్రీతిగారూ! వ్రతం అయి పోయినట్లుంది"

"అవునండీ..పొద్దున్నే పూర్తి చేసాం. అది లేట్ అయ్యేకొలదీ ఇక మనం మాట్లా డుకోలేం కదా! అందుకని..నమస్తే విష్ణు గారూ! బాగున్నారా.."

"బాగున్నానమ్మా! గుడ్‌మార్నింగ్ చంద్రకాంత్‌గారూ!"

"హు..ఇదో గుడ్ మార్నింగ్" సణు క్కుంటూ పైకి బలవంతాన నవ్వు పులు ముకున్నాడు చంద్రకాంత్.

వచ్చిన చుట్టాలంతా ఆశ్చర్యంగా కుతూహలంగా నీలిమను చూస్తుంటే తల ఎక్కడ పెట్టుకోవాలో అర్థం కాలేదతడికి.

మృదుస్వభావి, సున్నిత మనస్కురాలు, ఎల్ల ప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ ఉండే సుప్రీతిలో ఇంతటి క్రోధం కూడా ఉందని మొదటిసారి అర్థం అయింది. అప్పటికే పరిస్థితి చేయి దాటింది.

"నీలిమగారూ! వారు మా అత్తయ్య మామయ్య గారు, వీరు మా చిన్నమామయ్యగారు అత్తయ్య, వీళ్ళు నా కజిన్స్, తనేమో మా వదిన..ఇవాళ్టి నుంచి వాళ్ళకి నేనెంతో మీరూ అంతే"

ఆమె తెల్లబోయి ఓ మారు చంద్రకాంత్ వైపు చూసింది. అతడు తల తిప్పుకున్నాడు.

"ఇకపోతే తను నీలిమ..పెళ్ళయిన ఆరేళ్ళకే నాతో సంసారం విసుగెత్తిన మా ఆయన ఎంచుకున్న కొత్త పార్ట్‌నర్" పదునుగా ఒక్కో అక్షరాన్నే విడదీసి పలికింది.

నీలిమ ముఖం తెల్లగా పాలిపో యింది. షాకింగ్‌గా సుప్రీతిని చూసింది.

ఆమెకు నోటి నుంచి మాట రాలేదు.

ఆ గది అంతా చిక్కని నిశ్శబ్దం అలుముకుంది.

విష్ణు నివ్వెరపోయి సుప్రీతిని నీలిమనూ మార్చి మార్చి చూడసాగాడు.

తను విన్న వాక్యంలోని భావం అర్థమవుతున్న కొలదీ అతడి ముఖం ఎరుపురంగులోకి మారడం మొదలయ్యింది.

"ప్రీతిగారూ! మీరేం మాట్లాడుతున్నారు? ఏమిటి దంతా?" అసహనంగా అడిగాడు.

"క్షమించండి విష్ణుగారూ! మీకు బాధ కలిగించే దైనా ఇది నిజం..కాదని అబద్ధమని వాళ్ళు చెప్పగల రేమో అడగండి" భర్త వంక తీక్షణంగా చూస్తూ అంది సుప్రీతి.

"వాట్ ఈజ్ దిస్ నాన్‌సెన్స్ ప్రీతీ! హౌ కెన్ యు టాక్ లైక్ దట్..దిసీజ్ టూ మచ్.." తడబాటు,

## కష్టానికి ప్రతిఫలం

అతి తక్కువ కాలంలోనే టాప్ స్టార్‌గా శిఖరాలకు చేరిన ఇలియానా అసలు తను ఎప్పుడూ సినిమా స్టార్ అవుతానని, కావాలని అనుకోలేదంటుంది. అయితే ఎలాగూ సినిమాల్లో చాన్స్ వచ్చింది కాబట్టి సిన్సియర్‌గా చేయాలని దృఢంగా నిర్ణ యించుకుని ముందడుగు వేసిందిట. వచ్చిన అవకాశాల్ని చక్కగా వినియోగించుకుని ఈరోజున టాప్‌స్టార్ అయింది. తను పడిన కష్టానికి ప్రతిఫలాన్ని ఇప్పుడు ఎంచక్కా అనుభవి స్తున్నాను అంటుంది ఎంతో ధీమాగా ఇలియానా.



ఉక్రోషం రెండూ తొంగి చూసాయి నీలిమ గొంతులో.

"నిజమేనమ్మా! నాక్కూడా చాలా టూమ చ్‌గా అన్పించే మా ఆయన్ని హెచ్చరించబో యాను. 'నేను దాన్ని వదలను. ఏం చేసుకుం టావో చేసుకో..ఫో' అన్నాడు. మరి అదే మాట నువ్వు కూడా మీ ఆయనతో అనవచ్చుగా. అలా భయపడతావేం? అరె..ఏడుస్తావేంటి నీలిమా! నిప్పుతో చెలగాటమాడడానికి సిద్ధప డినప్పుడు తెలియదా పర్యవసానం ఎలా ఉంటుందో..పెద్ద చదువులు చదివి పెద్ద ఉద్యో గాలు చేస్తున్నారే..నాలుగు మాయమాటలు చెప్పగానే భర్తనీ సంసారాన్ని విస్మరించి వాడి మాయలో పడిపోవడమేనా? ఏ ధైర్యంతో మరో ఆడదాని సంసారంలో నువ్వు అడుగు పెట్టావు? దానికి నా మొగుడు నీకిచ్చిన భరోసా ఏమిటి? అసలు మీరిద్దరూ కలిసి నా గురించి ఏమనుకున్నారు? తెలిసినా ఏడు స్తుంది. గొడవ చేస్తుంది అంతకన్నా ఏం చేస్తుందిలే అనుకున్నారు కదూ! నీకింత ధైర్యం, భరోసా, సపోర్ట్ ఇచ్చి తన వలలోకి

లాగిన నా మొగుడు ఇలాంటి పరిస్థితిలో నిన్నెలా కాపాడతాడో అసలు ఎప్పుడైనా ఆలోచించావా? ఇప్పుడు ఏమిటి నీ పరిస్థితి? కట్టుకున్న మొగుడా? ఉంచుకున్న వాడా? ఏవైపు నీ దారి?"

చివాల్న లేచిన విష్ణు చరచరా ఆ పరిసరాల నుంచి వెళ్ళిపోయాడు. నీలిమ ఏడుస్తూ అతడిని అనుసరించబోయింది.

సుప్రీతి కఠినంగా ఆపింది.

"నీలిమా! నువ్వు వెళ్ళడానికి వీల్లేదు. నా ప్రశ్నకి జవాబు మీరిద్దరూ ఇచ్చిన తరువాతే నువ్వు వెళ్ళగలవు"

"ప్రీతీ! నీ పద్ధతేం బాగా లేదమ్మా! చదువుకున్నదానివై ఉండి చాలా చీప్‌గా ప్రవర్తిస్తున్నావు" ప్రీతి మామగారు నిష్ఠూరంగా అన్నారు.

పేలవంగా నవ్వింది సుప్రీతి.

"నాకు తెలుసు మామయ్యగారూ! ఇక్కడున్న వారెవరూ ఈ రకమైన చర్యను తట్టుకోలేరు. వారి దృష్టిలో ఇది బజారున పడడం.. కానీ కొన్ని ఏళ్ళుగా ఇల్లాలు ఇలాంటి సమస్యలు రహస్యంగానే ఉంచిందే.. భర్త పరువునీ తన పరువునీ కూడా కాపాడుకుందే..ఇంటికీ పిల్లలకీ అంకితమైన తనను నిర్లక్ష్యం చేసి అవమానపరిచి భర్త ఎవరెవరితోనో తిరుగుతూ ఉంటే నాలుగ్గోడల మధ్య ఏడిచి ఊరుకుందే..మరి ఇలాంటి భర్తల్లో కొందరైనా మారారా? తమ తప్పు తెలుసుకుని భార్యకి క్షమాపణ చెప్పారా? మూడు ముళ్ళకీ ఏడడుగులకీ విలువ ఇచ్చారా? లేదు. పైగా వారికి చాలా బలమైన నమ్మకం ఏమని ఏర్పడిందంటే తామెన్ని వెధవ పనులు చేసినా ఎందరితో అక్రమ సంబంధాలు పెట్టుకున్నా భార్య చచ్చినట్లు తన పరువు కాపాడుతుందే తప్ప బయటకు రాదని. ఆ రకంగా తమకు ఢోకా లేదని. ఆ ధైర్యమే మరో మగవాడైన మీ అబ్బాయిని 'ఏం చేసుకుంటావో చేసుకో ఫో' అనేలా చేసింది. ఇదేగా శాంతానికి, సహనానికి పరువుగా ఉన్నందుకు దొరికిన ఫలితం? ఇంతకన్నా ఏ ఇల్లాలికైనా ఇంకేమైనా దొరికిందా? అంతెందుకూ...ఇప్పుడు కూడా నాకు తెలిసిన నలుగురైదుగురు ఇల్లాళ్ళు ఇదే సమస్యతో కుములుతూ ఉన్నారు. కుమిలిపోతూనే పరమ పతివ్రతల్లా భర్తల పరువును కాపాడుతున్నారు. వారి దృష్టిలో ఆడదాని బ్రతుకంతే..తాము అంతకన్నా ఏం చేయలేం. ఇదీ వారి మానసిక స్థితి. అందుకే తరతరాలుగా సాగుతున్న ఈ పాత కథని ఓ కొత్త మలుపు తిప్పాలన్పించింది. ఇల్లాలే శిక్షించదలచుకుంటే..ఏ రకంగా శిక్షించగలదో చూపాలన్పించింది. ఇక్కడున్న మీరంతా నాకు పతివ్రతా ధర్మాలు చెప్తారే కానీ మగవాడికి కమిట్‌మెంట్ ఎందుకు నేర్పించరు? సంసారం మీ ఇద్దరికీ ముఖ్యమే. దాన్ని సంరక్షించుకొని కాపాడుకోవలసిన బాధ్యత మగవాడిగా నీక్కూడా ఉంది అని మగవాడికి ఎందుకు చెప్పరు? ఒకసారి తాళి కట్టేసాక ఇక నీ కాళ్ళ దగ్గరే పడి ఉంటుందనే అహంకారం తప్పు. భార్యని గౌరవించు. తన ప్రాముఖ్యత తెలుసుకో అని ఎందుకు చెప్పరు?

అసలు తప్పు చేసిన మగవాడిని ఎవరూ ఎందుకు నిలదీయరు? అదో పెద్ద ఇష్యూ కానట్లు చూసీ చూడనట్లు ఎందుకు వదిలేస్తారు? ఆడది మౌనంగా వింటుందనా? మొగుడు తప్పు చేసినా తాను తలవంచుతుందనా? తానేమైనా చేయవచ్చు. తనకా స్వేచ్ఛ ఉందనే భావన తరతరాలుగా ఎందుకు మగవాడిలో పెంచుతూ వస్తున్నారు? ఇప్పుడు కూడా నా మొగుడు ఇంత నమ్మకద్రోహం చేస్తే దగ్గర కూర్చుని ప్రేమగా లాలించి మార్చుకోమని చెప్పింది నా అత్తగారు. అదే పని నేను చేస్తే కొడుక్కి అదే సలహా ఇచ్చి ఉండేదా? 'నీకేం పోయేకాలమే' అని అడిగి ఉండేది నన్ను.


ఏవమ్మా నీలిమా! చూస్తున్నావుగా మీరు చేసిన పనికి పర్యవసానం ఏమిటో..ఏం? నువ్వుగానీ నా మొగుడుగానీ పెళ్ళి చేసుకున్నప్పుడు కళ్ళు మూసుకుని చేస్కున్నారా? ఇష్టపడేగా చేసుకున్నారు? మరి ఆయనకి భార్య మీద నీకు మొగుడి మీద ఇంత విరక్తి ఎందుకు వచ్చింది?

ఐటీ ఉద్యోగాల పేరుతో కలిసి పని చేసే ప్రతి చోటా బాధ్యతలు మరిచి ప్రేమాయణాలు సాగిస్తే దాని ముగింపు ఎలా ఉంటుంది అనుకుంటున్నారు? ఇలాగే ఉంటుంది. ఆకర్షణలు ఆడామగకి సమానమైనా దాని ఫలితాలు ఇరువురి జీవితాల్లో చాలా వేరుగా ఉంటాయి. ఇద్దరూ ఒకే తప్పు చేసారు. ఈయన నా ఇష్టం అన్నాడు. నువ్వెళ్ళి ఆయన కాళ్ళమీద పడతావు. అదీ తేడా"

సుప్రీతి మామగారి వైపు చూసింది.

"మామయ్యా! నేనిదివరకే ఆయనకు చెప్పాను. తను చేసిన తప్పుకి మీ అందరి ముందూ నాకు క్షమాపణ చెప్పి ఇక పైన ఒళ్ళు దగ్గరుంచుకుని సంసారం చేస్తేనే ఈ ఇంట్లో ఆయనకి చోటు. లేకపోతే తనీ ఇంట్లో ఉండానికి వీల్లేదు. మీరంతా ఆయనకేం చెప్తారో మీ ఇష్టం.. ఆడదంటే అన్యాయాన్ని సహిస్తూ అణిగిమణిగి పడి ఉండేది అనే భావనని ఇకనైనా మార్చుకుంటే మంచిది."

చెప్పాల్సింది చెప్పి లోపలికి వెళ్ళిపోయింది సుప్రీతి.



## తెలిసొచ్చిన తప్పు!

*గతంలో బ్లాక్‌బస్టర్ సినిమా 'చంద్రముఖి'లో జ్యోతిక ధరించిన పాత్రని రిజెక్ట్ చేసినందుకు ఆ తర్వాత ఎంతో బాధపడింది సిమ్రన్. అలాగే రజనీ తాజా చిత్రం 'కుచేలన్'లో కూడా ఆఫర్ ఇస్తే వద్దన్నందుకు కొంతలో కొంత విచారిస్తున్న సమయంలో మరో చాన్స్ వచ్చింది. హిందీ సినిమా 'టాక్సీ నం.9211' తమిళ రీమేక్‌లో నటించమని సిమ్రన్‌ని అడిగితే ఠక్కున ఓకే అందిట. గతంలో చేసిన పొరపాట్లని తల్చుకుని బాధపడకుండా వుండేందుకే ఈ సినిమాని సిమ్రన్ ఒప్పుకుంది అంటున్నారు చెన్నయ్ సినీవాలాలు.*